క్లుప్తంగా

మహిళా సాధికారతతోనే సుపరిపాలన



మాట్లాడుతున్న డీఎల్‌డీవో వాణిరెడ్డి

గూడూరు రూరల్ : మహిళా సాధికారతతోనే సుపరిపాలన సాధ్యమని గూడూరు డీఎల్‌డీవో వాణిరెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం గూడూరు డివిజన్‌లోని మహిళా సర్పంచులకు మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ స్థానిక స్వపరిపాలనలో మహిళా సాధికారత– గ్రామీణాభివృద్ధిలో భాగంగా మహిళల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు ప్రభుత్వం శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో గూడూరు ఎంపీడీవో మధుసూదన్‌రావు, డిప్యూటీ ఎంపీడీవో మోహన్, ఎంవోటీ ఎంపీడీవో బ్రహ్మయ్య, గూడూరు, మనుబోలు, బాలాయపల్లి, డక్కిలి, కోట, సైదాపురం, చిల్లకూరు, వెంకటగిరి మండలాల మహిళా సర్పంచులు పాల్గొన్నారు.

హైకోర్టు ఉత్తర్వులు అమలు చేయండి



కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేస్తున్న శిరీష

కలువాయి(సైదాపురం): తనను విధుల్లోకి చేర్చుకోవాలని హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చినా అధికారులు పట్టించుకోవడం లేదని కలువాయి మండలం దాచూరు వీవోఏ శిరీష వాపోయారు. ఆమె సోమవారం నెల్లూరు జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆమె మాట్లాడుతూ రాజకీయ నాయకుల ఒత్తిడి మేరకు తనను విధుల నుంచి తొలగించారని తెలిపారు. తాను హైకోర్టును ఆశ్రయించడంతో తనకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. దాచూరు సంఘ బంధం తీర్మానం లేకుండానే గ్రామంలో వెలుగు ఏపీఎం రవి, సీసీ మస్తాన్‌వలీ ఇతరులతో అనధికారికంగా వెలుగు యాప్‌లో లాగిన్ ఇచ్చి పని చేయిస్తున్నారని ఆరోపించారు. గతంలో వీవోఏ స్వప్నను అప్పటి కలెక్టర్ టెర్మినేషన్ చేసినప్పటికీ ప్రస్తుతం ఆమె పేరును ఆన్‌లైన్‌లో ఉంచి ఆమెకు బదులుగా మరొకరితో పనులు చేయిస్తున్నారని తెలిపారు.

సముద్రంలో నిఘాపై ఎన్‌సీసీ క్యాడెట్లకు శిక్షణ



క్రిష్ణపట్నం ఓడరేవు వద్ద శిక్షణలో ఎన్‌సీసీ నావల్ యూనిట్

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో ఎన్‌సీసీ 10ఏ నావల్ యూనిట్ వార్షిక శిక్షణలో భాగంగా ఎన్‌సీసీ క్యాడెట్లు సోమవారం క్రిష్ణపట్నం ఓడరేవులో ఇండియన్ కోస్ట్‌గార్డ్ షిప్పును సందర్శించారు. వారికి కోస్ట్‌గార్డు అధికారులు సముద్రంలో నిఘా, తీరప్రాంత గస్తీ, అక్రమ రవాణా నియంత్రణ, మత్స్యకారుల రక్షణ, రెస్క్యూ తదితరాలపై అవగాహన కల్పించారు. ఇండియన్ కోస్ట్‌గార్డ్ షిప్‌లోని వివిధ భాగాలు, కార్యాచరణ వ్యవస్థల గురించి వివరించారు. రైఫిల్ షూటింగ్‌పై ఏఎస్‌వోలు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కమాండింగ్ ఆఫీసర్ గణేష్ గొడంగవే, కోస్ట్‌గార్డ్ అధికారులు సోలంకి, మురుగన్ పాల్గొన్నారు.

పింఛను తొలగించారు



రమణమ్మ

కలువాయి(సైదాపురం): తనకు వచ్చే వికలాంగుల పింఛనును తొలగించారని, తిరిగి మంజూరు చేయాలని కలువాయి మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన పల్లాల రమణమ్మ వాపోయింది. ఆమె సోమవారం ఎంపీడీవో కార్యాలయ అధికారులను కలిసి తన గోడు వెల్లబోసుకుంది. తనకు పుట్టు చెముడు ఉందని, గతంలో పింఛను వచ్చేదని తెలిపింది. ఇటీవల వెరిఫికేషన్ పేరుతో పింఛన్‌ను నిలిపేశారని వాపోయింది. తిరిగి మంజూరు చేయాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది.

కలువాయి ఎస్‌ఐగా కోటయ్య



కలువాయి(సైదాపురం) : కలువాయి ఎస్‌ఐగా ఎస్.కోటయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ సుమన్ ఈ నెల 22న వీఆర్‌కు బదిలీ అయ్యారు. దీంతో కండలేరు ఎస్‌ఐ రామకృష్ణ ఇన్‌చార్జిగా వ్యవహరించారు. ఈ క్రమంలో రెగ్యులర్ ఎస్‌ఐగా కోటయ్య బాధ్యతలు స్వీకరించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి

నాయుడుపేట టౌన్ : ట్రాఫిక్ నియమాలను పాటించకపోతే చర్యలు తప్పవని సీఐ బాబి హెచ్చరించారు. ఆయన సోమవారం నాయుడుపేటలోని పలు ప్రధాన కూడళ్లలో వాహనాలను తనిఖీ చేశారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని వారికి జరిమానా విధించారు. బజారు వీధి, వెల్‌కమ్ సెంటర్, దర్గా వీధి, పాత బస్టాండ్ తదితర ప్రాంతాల్లో వాహనాలను ఒక వైపు పార్కింగ్ చేసేలా చర్యలు తీసుకున్నారు. పట్టణంలోకి భారీ వాహనాలు రాకుండా ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

ఖాళీ జాగా.. వేసెయ్ పాగా

వెంకటగిరిలో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ఖాళీ జాగా కనిపిస్తే చాలు యథేచ్ఛగా ఆక్రమించుకుంటున్నారు. వారికి రెవెన్యూ శాఖలోని కింది స్థాయి సిబ్బంది సహకరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఆక్రమణదారులను కట్టడిచేసి ప్రభుత్వ భూములను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

- వెంకటగిరిలో రెచ్చిపోతున్న అక్రమార్కులు
- రూ.లక్షల విలువచేసే భూముల ఆక్రమణ
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు



ఎన్జీవో కాలనీలో ఏర్పాటు చేసిన ప్లాట్ల హద్దురాళ్లు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : వెంకటగిరి పట్టణంలోని పెరియవరం లెక్కదాఖలా సర్వేనంబర్లలో 150–1, 151–1, 152లో ప్రభుత్వ భూమి ఉంది. అందులో మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి హయాంలో ఎన్జీవో కాలనీ లేఅవుట్ వేశారు. అందులో 336 మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగులకు గ్రేడ్లను బట్టి 5, 4, 3 సెంట్ల చొప్పున పంపిణీ చేశారు. అక్కడ ఇంకా ప్రభుత్వ ఖాళీ భూమి వుంది. అప్పట్లో వెంకటగిరి అభివృద్ధిలో వెనుకబడి ఉండడంతో అక్కడ నివాసాలు ఉండడానికి అధికారులు మొగ్గు చూపలేదు. కొంతమంది తమకు ఇచ్చిన స్థలాలను రక్షించుకునేందుకు యత్నించారు. రానురాను పట్టణం విస్తరించడం, స్థలాలకు డిమాండ్‌తోపాటు స్థలాల ధరలకు రెక్కలు వచ్చాయి. ప్రస్తుతం ఇక్కడ సెంటు భూమి రూ.15 లక్షల వరకు పలుకుతోంది. దీంతో ఆ భూమిపై కొంతమంది అక్రమార్కుల కన్ను పడింది. రెవెన్యూ శాఖలోని కింది స్థాయి అధికారుల సహకారంతో దాన్ని ఆక్రమించుకునేందుకు పావులు కదిపారు. ఆ భూమిని పట్టాదారుల వద్ద కొనుగోలు చేశామని, తమకు చెందుతుందని పేర్కొని రెవెన్యూ అధికారులతో పొజిషన్ సర్టిఫికెట్లు పొందినట్టు సమాచారం. దాన్ని చూపి రిజిస్ట్రేషన్ చేసుకున్నట్టు తెలిసింది. అంతేగాక పక్కనున్న ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని అందులో ప్లాట్లు వేసి విక్రయిస్తున్నారు. ఇందులో భాగంగా తాజాగా 12 ప్లాట్లను విక్రయించడానికి సిద్ధం చేశారు. వాటికి హద్దురాళ్లు సైతం ఏర్పాటు చేశారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా చొరవ తీసుకుని ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా చూడాలని కోరుతున్నారు. దీనిపై తహసీల్దార్ రాంబాబు వివరణ ఇచ్చారు. ఎన్జీవో కాలనీలో గతంలో పట్టాలు పొందిన వారు కొంత మంది స్థలాలను విక్రయించారని తెలిపారు. అందులో ప్రస్తుతం అనుభవంలో ఉన్న వారికి రెవెన్యూ పొజిషన్ సర్టిఫికెట్ మంజూరు చేసినట్టు తెలిపారు. అంతేగాని ఆ కాలనీలో భూ ఆక్రమణలు జరిగినట్లు తమ దృష్టికి రాలేదని స్పష్టం చేశారు.

పేదలకు ఆలయ భూములు పంచాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

చిల్లకూరు : మండలంలోని ఓడూరులో వెలసిన చెన్నకేశవ స్వామి ఆలయ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని, వాటిని పేదలకు పంచితే సాగు చేసుకుంటారని పున్నపువారిపాళెం వాసులు కోరారు. వారు సోమవారం తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పున్నపువారిపాళెం సమీపంలో వున్న ఆలయ భూములను కొన్నేళ్లుగా ఒకరే అనుభవిస్తున్నారని తెలిపారు. ట్రస్టీల ఇష్టానుసారంగానే అలా చేస్తున్నట్టు అధికారులు చెబుతున్నారని పేర్కొన్నారు. దీనిపై విచారణ చేసి ఆ భూములను పేదలకు ఇవ్వాలని కోరారు. తహసీల్దార్ మాట్లాడుతూ దేవాదాయశాఖాధికారులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ను పంపి భూములను పరిశీలిస్తామని తెలిపారు.

శ్మశానానికి భూమి కేటాయించాలని వినతి

సాగరమాల రోడ్డు విస్తరణలో ఖబరస్తాన్ పోయిందని, తమకు స్థలం కేటాయించాలని ముత్యాలపాడు పంచాయతీకి చెందిన ముస్లింలు కోరారు. వారు సోమవారం సర్పంచ్ హరితతో కలిసి తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ గతంలో గ్రామానికి చెందిన సుబ్బన్న గుంటలో కొంత స్థలం చూపించారని తెలిపారు. దాన్ని కొంతమంది ఆక్రమించుకున్నారని, దీనిపై విచారణ చేసి ఖబరస్తాన్‌కు స్థలం కేటాయించాలని కోరారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్



పిల్లలకు పుస్తకాలు అందజేస్తున్న శ్రీనివాసులు

రాపూరు : విద్యార్థులు కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎంఈవో శ్రీనివాసులు తెలిపారు. ఆయన సోమవారం రాపూరు, గొనుపల్లి గ్రామాల్లోని కరుణామయి విద్యాలయంలో చదువుకుంటున్న విద్యార్థులకు ఉచితంగా పాఠ్య, నోటు పుస్తకాలు, స్టడీ మెటీరియల్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ మాతృశ్రీ విజయేశ్వరిదేవి పేద పిల్లలకు ఉచిత విద్య అందించేందుకు మారుమూల రాపూరు మండలంలో పాఠశాలలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి తల్లితండ్రులు, ఆశ్రమ నిర్వాహకులు విజయేశ్వరిదేవి, భరత్‌కు మంచిపేరు తీసుకురావాలని కోరారు. హెచ్‌ఎంలు శంకరయ్య, మస్తానయ్య, పాఠశాలల ఇన్‌చార్జి వెంకట్రాయులు పాల్గొన్నారు.

గుంట కబ్జాపై ఫిర్యాదు



ట్రాక్టర్లతో మట్టితోలి గుంటను పూడ్చుతున్న అక్రమార్కులు

సూళ్లూరుపేట రూరల్ : మండలంలోని మన్నేముత్తేరి పంచాయతీ జంగాలగుంట గ్రామం నడిబొడ్డున వున్న గుంటను కొంతమంది ఆక్రమించుకుంటున్నారని, దాన్ని కాపాడాలని గ్రామస్తులు కోరారు. వారు సోమవారం తహసీల్దార్ నరసింహారావుకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఈ గుంట 2.5 ఎకరాల విస్తీర్ణం వుందన్నారు. ఇందులోని నీటిని పంటలకు వినియోగించుకుంటున్నట్టు తెలిపారు. గ్రామంలో ఎవరైనా చనిపోతే కర్మక్రతువులు కూడా ఈ గుంట వద్దే చేసుకుంటున్నట్టు తెలిపారు. కొంతమంది గుంటను పూడ్చివేసి ఆక్రమించుకుంటున్నారని వాపోయారు. స్పందించిన ఆయన పరిశీలించి ఆక్రమణలను అడ్డుకోవాలని వీఆర్వో రాజగోపాల్‌ను ఆదేశించారు.

పిల్లలను అంతదూరం పంపించలేము



ఎంఈవోకు వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు



ఎంపీడీవోకు వినతి పత్రమిస్తున్న అక్కంపేట వాసులు

దొరవారిసత్రం : బేరిజంగాలపల్లిలోని ప్రాథమిక పాఠశాలను 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న కారికాడు పాఠశాలలో కలపడం దారుణమని గ్రామస్తులు వాపోయారు. వారు సోమవారం ఎంఈవో కృష్ణయ్యకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ బేరిజంగాలపల్లిలో 11 మంది పిల్లలు చదువుకుంటున్నారని తెలిపారు. వారిని దూరంగా వున్న పాఠశాలకు పంపించాలంటే ఎలా అని ప్రశ్నించారు. గ్రామం నుంచి కారికాడుకు పులికాట్ సరస్సు వెంబడి రోడ్డులో ఇబ్బందులు పడుతూ వెళ్లాల్సి ఉంటుందని తెలిపారు. భారీ వర్షాలు కురిస్తే పిల్లలు బడులకు వెళ్లలేని పరిస్థితి ఉంటుందన్నారు.

మా ఊరి బడే మా పిల్లలకు క్షేమం

తడ: జాతీయ రహదారికి తూర్పు వైపు ఉన్న బడిని పడమర వైపు ఉన్న మరో బడిలో కలపడం వల్ల మా పిల్లల భద్రతకు ముప్పు పొంచి ఉందని అక్కంపేట గ్రామం దళితవాడకు చెందిన మహిళలు వాపోయారు. వారు సోమవారం ఎంపీడీవో శేఖర్‌నాయక్, ఎంపీపీ కే రఘురెడ్డికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రతి నిత్యం రోడ్డు ప్రమాదాలు జరిగే అక్కంపేట వద్ద జాతీయ రహదారిని దాటడం పెద్దలకే సాధ్యం కావడం లేదని, పిల్లలు ఎలా వెళతారని ప్రశ్నించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పరిశ్రమల బస్సులు ఎక్కువగా తిరుగుతుంటాయని, కూలి పనులకు వెళ్లే తాము పిల్లలను ప్రతి రోజూ స్కూలుకు తీసుకు వెళ్లడం కుదరదని వాపోయారు. మా ఊరి బడే మా పిల్లలకు క్షేమమని, పిల్లలను మరో పాఠశాలకు పంపించేది లేదని హెచ్చరించారు.

తూతూమంత్రంగా మైనింగ్ అధికారుల తనిఖీలు

కలువాయి(సైదాపురం): కలువాయి మండలం కోటూరుపల్లిలో జరుగుతున్న తెల్లరాయి అక్రమ మైనింగ్‌పై అధికారులు సోమవారం తూతూమంత్రంగా తనిఖీలు చేపట్టారు. తెల్లరాయి అక్రమ రవాణాపై ఆగని తెల్లరాయి తవ్వకాలు అన్న శీర్షికన సోమవారం సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీనిపై జిల్లా అధికారులు స్పందించారు. జిల్లా మైనింగ్ కార్యాలయానికి చెందిన ఆర్‌ఐ స్వాతి సోమవారం కోటూరుపల్లికి వచ్చి వెంటనే వెళ్లిపోయారు. దీనిపై ఆమె మాట్లాడుతూ గతంలో ఒక రైతు జామాయిల్ మొక్కలు నాటేందుకు తవ్వకాలు చేపట్టగా తెల్లరాయి బయటపడినట్టు వీఆర్వో, రైతు రాతపూర్వకంగా తెలియజేశారని వెల్లడించారు. మైనింగ్ డీడీకి నివేదిక అందజేసి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

నాయుడుపేట టౌన్: వార్డుల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా తెలిపారు. ఆయన సోమవారం రాజగోపాలపురంలో పర్యటించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలోని 25 వార్డులకు చెందిన ప్రజా ప్రతినిధులతో కలిసి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రజలు చెత్తను కాలువల్లో వేయకుండా పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలని సూచించారు. ఆస్తి, నీటి పన్నులను సకాలంలో చెల్లించాలన్నారు. జూన్ నెలాఖరు వరకు వడ్డీ లేకుండా పన్నులు చెల్లించవచ్చన్నారు. పట్టణంలో సుమారు 82 భవనాలకు అనుమతులు లేవని, యజమానులకు నోటీసులు జారీ చేసినట్టు పేర్కొన్నారు.

యువత పోరుకు తరలిన నాయకులు



నాయుడుపేట టౌన్ : నెల్లూరులో జరిగిన యువత పోరు కార్యక్రమానికి వెళుతున్న నాయకులు



యువత పోరులో చిట్టమూరు మండల నేతలు

నాయుడుపేట టౌన్/చిట్టమూరు: కూటమి ప్రభుత్వం యువతకు వచ్చిన హామీలు అమలుచేయకపోవడాన్ని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో నెల్లూరులో సోమవారం యువత పోరు కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సూళ్లూరుపేట నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో నాయకులు, యువకులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. అదేవిధంగా చిట్టమూరు నుంచి వైఎస్సార్ సీపీ గూడూరు నియోజకవర్గ యువత అధ్యక్షుడు మాచిరెడ్డి సుధీర్‌రెడ్డి, నియోజకవర్గ పార్టీ కల్చరల్ వింగ్ అధ్యక్షుడు వాకాటి అశ్విన్ రెడ్డి, వైసీ పుట్టబాబు, ఎల్లూరు సంపత్ ఆధ్వర్యంలో యువకులు తరలివెళ్లారు. కార్యక్రమంలో నాయుడుపేట, ఓజిలి, దొరవారిసత్రం, తడ మండలాల కన్వీనర్లు ఒట్టూరు కిషోర్ యాదవ్, పాదర్తి హరినాథ్‌రెడ్డి, అల్లూరు రాహుల్ రెడ్డి, ఆర్ముగం, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి, ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మీ, నియోజవర్గ మహిళ కన్వీనర్ ఈదా రత్నశ్రీ, యువజన విభాగ పట్టణ అధ్యక్షుడు పాలేటి నాగార్జున, నాగిరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి, సాయి, నిడిగింటి చిట్టిబాబు, నెలవల రవి, పిండుకూరు మధుసూదన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో మంటలు

వెంకటగిరి రూరల్: వెంకటగిరి పట్టణం రాపూరు క్రాస్ రోడ్డులో వున్న ఏకేఆర్ ఫంక్షన్ హాల్ వద్ద సోమవారం తాళం వేసిన ఇంట్లో మంటలు చెలరేగాయి. అగ్నిమాపకశాఖ అధికారి నారాయణ కథనం మేరకు.. ఏకేఆర్ ఫంక్షన్ హాల్ సమీపంలోని ఇంటిలో వుంటున్న కాసుల హేమలత వారం రోజుల క్రితం ఇంటికి తాళం వేసుకుని మలేషియాలో ఉన్న తమ కుమార్తె వద్దకు వెళ్లింది. సోమవారం ఇంటిలో మంటలు చెలరేగి పొగలు వ్యాపించడంతో స్థానికులు హేమలత డ్రైవర్ బాషా, అగ్నిమాపకశాఖ సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపకశాఖ అధికారులు అక్కడికి చేరుకుని మంటలను అదుపుచేశారు. ఫ్రిడ్జ్‌లోని గ్యాస్ క్లాట్ కావడం వల్ల మంటలు చెలరేగినట్టు అధికారులు తెలిపారు. దీంతో విద్యుత్ పరికరాలు దెబ్బతిన్నాయన్నారు. రూ.1.50 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ సిబ్బంది రాజా, అంజయ్య, శివ, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు బెంచీల వితరణ



పాఠశాలకు బెంచీలు అందజేస్తున్న రోటరీ క్లబ్ అధ్యక్షుడు జయరాజగోపాల్

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని టంగుటూరి ప్రకాశం పంతులు ప్రభుత్వ పాఠశాలకు రోటరీ క్లబ్ ప్రతినిధులు సోమవారం బెస్ట్ రన్నర్స్ ఆర్గనైజేషన్(యూఎస్‌ఏ) ఆర్థిక సహకారంతో సుమారు రూ.1.50 లక్షలతో 33 బెంచీలను అందజేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు పెసల జయరాజగోపాల్ మాట్లాడుతూ నాయుడుపేట రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో మునిరత్నం, హెచ్‌ఎం సురేష్, రోటరీ క్లబ్ సభ్యులు రామ్మోహన్, చంద్రశేఖర్, మునగాల కృష్ణారావు, ఆదవరం నాగురయ్య, మండిగ సోమశేఖర్, డాక్టర్ గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పంట కాలువ పరిశీలన



రైతులతో మాట్లాడుతున్న అధికారులు

పెళ్లకూరు : మండలంలోని వడ్డిపాళెం వద్ద 71వ జాతీయ రహదారి అభివృద్ధి పనుల్లో భాగంగా పూడ్చివేసిన పంట కాలువను సోమవారం నీటి పారుదల విభాగం ఈఈ బాబు, డీఈ వీరాస్వామి పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యను తెలుసుకున్నారు. రైతులు మాట్లాడుతూ గ్రామంలో సుమారు 1500 ఎకరాలకు పైగా సాగు భూములున్నాయని తెలిపారు. ప్రతి కుటుంబం వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నట్లు వివరించారు. గతంలో వర్షపు నీరు పంట కాలువ ద్వారా జీలపాటూరు చెరువులోకి చేరేదని తెలిపారు. తద్వారా పంటకు సాగునీటి కొరత ఉండేది కాదని వివరించారు. రోడ్డు పనుల్లో కాలువను పూడ్చేయడంతో చెరువులోకి నీరు రావడం లేదని తెలిపారు. అధికారులు మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు లేకుండా వర్షాకాలానికి ముందే పంట కాలువను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కందమూడి శివకుమార్, సాగునీటి సంఘం అధ్యక్షుడు ఆరూరు బాలాజి, రైతులు రమణయ్య, ప్రకాష్, రమణారెడ్డి, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం



రోగులకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

వెంకటగిరి రూరల్ : క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జీకేపల్లి పీహెచ్‌సీ వైద్యులు సి.లావణ్య తెలిపారు. తిరుపతి స్విమ్స్ ఆధ్వర్యంలో సోమవారం యాతలూరు, వల్లివేడు గ్రామాల్లో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. వైద్యాధికారిణి లావణ్య మాట్లాడుతూ ముందుగా గుర్తిస్తే క్యాన్సర్‌ను నియంత్రించవచ్చని తెలిపారు. అనంతరం బీపీ షుగర్ పరీక్షలతోపాటు పురుషులకు నోటి క్యాన్సర్, మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణకు పరీక్షలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్విమ్స్ మెడికల్ ఆఫీసర్ చైతన్య భాను, డాక్టర్ హరిత, సర్పంచ్ పెంచలమ్మ, కార్యదర్శులు చందన, కేవీరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

నీటి వృథాను అరికట్టాలని వినతి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కౌన్సిలర్ శంకరయ్య

వెంకటగిరి రూరల్ : ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నట్టు 14వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య తెలిపారు. ఆయన సోమవారం 14వ వార్డులోని సుదర్శననగర్ సచివాలయంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ హనుమాన్ నగర్‌లో ఉన్న ట్యాంకు వద్ద పైపులైన్ గేట్‌వాల్ పనిచేయకపోవడంతో నీరు వృథాగా పోతోందన్నారు. 14 నుంచి 18వ వార్డుల్లోని ప్రజలకు నీరు అందడం లేదన్నారు. పట్టణంలోని పలు రోడ్ల పక్కన స్థలాల్లో గదులు నిర్మించి అద్దెకు ఇస్తున్నారని తెలిపారు. వాటిపై చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డికి వినతి పత్రం సమర్పించారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థిని ఎంపిక



ఇంద్రజ

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి పట్టణంలోని ఏపీ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థిని కలపాటి ఇంద్రజ ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. ఆమె పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించి జిల్లాలో ప్రథమ స్థానం, రాష్ట్రంలో ద్వితీయ స్థానం సాధించింది. ఆమెను పలువురు అభినందించారు.

భూ సమస్యలపై వినతుల వెల్లువ

దొరవారిసత్రం : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రెవెన్యూసమస్యలపై ఫిర్యాదులు వచ్చినట్టు తహసీల్దార్ శైలకుమారి తెలిపారు. అడంగళ్లు, 1 బీ, పట్టాదారు పాసు పుస్తకాలు, రెవె న్యూ రికార్డుల్లో పేర్ల మార్పు, చేర్పుల కోసం రైతు లు అర్జీలు ఇచ్చారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో గోవర్ధన, అధికారులు హరికృష్ణ, మోహన్‌రావు, ఉమామహేశ్వరి, వెంకటేశ్వర్లు, మునిరాజ తదితరులు పాల్గొన్నారు.

5న జగన్నాథ రథయాత్ర

గూడూరు రూరల్ : నెల్లూరు ఇస్కాన్ ఆధ్వర్యంలో జూలై 5వ తేదీన గూడూరులో 11వ జగన్నాథ రథయాత్ర నిర్వహించనున్నట్టు ఇస్కాన్ ప్రచార కేంద్రం నిర్వాహకులు డాక్టర్ సుఖదేవ్ తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రతి ఏటా పూరీలో నిర్వహించే జగన్నాథ రథయాత్రకు అనుగుణంగా గూడూరులోనూ రథయాత్ర చేపడుతున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా పట్టణంలోని సొసైటీ ప్రాంతంలో వున్న నారాయణమ్మ పేరంటాలు గుడి నుంచి యాత్ర ప్రారంభమై ఐసీ ఎస్ రోడ్డు, కుమ్మరవీధి, రాజావీధి, జెడ్పీ హైస్కూ ల్ రోడ్డు, బనిగిసాహెబ్‌పేట, సుందర మహల్ రోడ్డు, టవర్ క్లాక్ మీదుగా డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలు వద్దకు చేరుకుంటుందని తెలిపారు.

ఆయుర్వేద వైద్యుడికి సన్మానం



చిల్లకూరు : ఆయుర్వేద మందులతో వ్యాధులను పూర్తిగా నయం చేయవచ్చని మోమిడి ఆయుర్వేద వైద్యశాల వైద్యులు కలపాటి శేఖర్ తెలిపారు. బదిలీపై వెళుతున్న ఆయనను సోమవారం గ్రామస్తులు, జిందాల్ పరిశ్రమ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల క్రితం ఆస్పత్రి వైపు పది మంది కూడా వచ్చేవారు కాదన్నారు. నేడు ప్రతి రోజూ 50 మంది వైద్య సేవలు పొందుతున్నారని తెలిపారు. ఆయుర్వేద మందులు కొంత ఆలస్యంగా పనిచేస్తాయని, దీనిపై అవగాహన ఉన్న వారు ఆ మందులనే వినియోగిస్తారని తెలిపారు. అలాగే నెల్లూరు జిల్లా టీపీ గూడూరు నుంచి వచ్చిన ఆయుర్వేద వైద్యులు రాజ్యలక్ష్మి బాధ్యతలు చేపట్టారు.

నేడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది

దొరవారిసత్రం : మండలంలోని అక్కరపాక, సూరపు అగ్రహారం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఏవో జ్యోతిర్మయి తెలిపారు. ఇందులో భాగంగా రైతులకు పంటలకు సోకే చీడపీడలు, వాటి నివారణ, మట్టి నమూనాల సేకరణ, పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తామని పేర్కొన్నారు.

గాయపడిన యువకుడి మృతి

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి పట్టణం తారకరామా క్రీడా మైదానం వద్ద ఆదివారం రాత్రి బైక్ అదుపుతప్పి కారును ఢీకొని తీవ్రంగా గాయపడిన యువకుడు మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. వెంకటగిరి పట్టణం బొప్పాపురానికి చెందిన తోట మహేష్(24) ఆదివారం రాత్రి బైక్‌లో మనులాలపేట నుంచి క్రాస్ రోడ్డు మీదుగా బొప్పాపురం వెళ్తున్నాడు. గాలులు పెద్ద ఎత్తున వీచి వర్షం పడడం, విద్యుత్ లేకపోవడంతో తారకరామా క్రీడా ప్రాంగణం వద్ద అదుపుతప్పి కారును ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని స్థానికులు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి వైద్యులు తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. అక్కడ పరిస్థితి విషమించి మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

రూ.12 లక్షలతో విద్యుత్ పనులు

వెంకటగిరి రూరల్ : వెంకటగిరిలో ఆదివారం రాత్రి గాలివాన బీభత్సానికి పలుచోట్ల విద్యుత్ స్తంభాలు, చెట్లు పడిపోయాయి. పోలిశెట్టి గుంట వద్ద ఉన్న భారీ చెట్టు నేలకి ఒరిగిపోయి విద్యుత్ వైర్లపై పడడంతో రెండు ట్రాన్స్‌ఫార్మర్లు, 7 స్తంభాలు నేలకూలాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో ట్రాన్స్‌ఫార్మర్‌లు, స్తంభాల పునఃరుద్ధరణకు ఎస్‌ఈ సురేంద్ర నాయుడు, ఈఈ వై.శ్రీనివాసులు రూ.12 లక్షలు కేటాయించారు. ఈ క్రమంలో వెంకటగిరి సబ్ డివిజన్ డీఈ మునిరవిచంద్ర, ఏఈల పర్యవేక్షణలో అధికారులు, సిబ్బంది యుద్ధప్రాతిపదికన పనులు చేసి విద్యుత్ పునఃరుద్ధరణకు చర్యలు చేపట్టారు.

పశువైద్యశాలను తనిఖీ చేసిన డీడీ

సైదాపురం : స్థానిక పశువైద్యశాలను సోమవారం నెల్లూరు పశువైద్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగమణి తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధులు వస్తున్న నేపథ్యంలో పశువుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు, సూచనలు ఇచ్చారు. సైదాపురం, గిద్దలూరు పశువైద్యాధికారులు సుధీర్, సుదర్శన్ ఉన్నారు.

వాహనాలకు జరిమానా

కలువాయి(సైదాపురం): ఆత్మకూరు ఆర్టీవో రాములు సోమవారం కలువాయి బస్టాండ్ పరిసరాల్లో వాహనాలను తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని రెండు బైక్‌లు, అధిక లోడ్‌తో వెళ్తున్న రెండు లారీలు, స్కూల్ బస్సు, ఆటోకు రూ.50 వేలు జరిమానా విధించారు. ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడిపేవారు హెల్మెట్ ధరించాలని సూచించారు.